జనసేన నియోజకవర్గ నాయకులు లోకేష్‌తో ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నారాలోకేష్‌ను సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ చల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లోకేష్‌తో కలిశారు. చల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకేష్ విజయానికి జనసేన పార్టీ నాయకులంతా కలిసి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, షేక్ సుభాని, వాసా శ్రీనివాసరావు, జేవీ సాంబశివరావు పాల్గొన్నారు.

'గుడ్ మార్నింగ్ మంగళగిరి' కార్యక్రమం

విశాలాంధ్ర-మంగళగిరి : గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి పట్టణంలోని 27వ వార్డు రాజీవ్ గృహకల్పలో సోమవారం పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిం చారు. రాజీవ్ గృహకల్ప ప్రజలు, నేతన్నలకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన మగ్గాల షెడ్లలో ఉన్న చేనేతలను కలిసిన చిరంజీవి స్వయంగా మగ్గం నేసారు. రాజీవ్ గృహకల్ప ప్రజలు వైసీపీకి పూర్తి మద్దతు ప్రకటించి, నేతన్నలు, పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్న ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

విశాలాంధ్ర-తెనాలి : కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం జరిగి నేటికి 37 రోజులు గడుస్తున్న ప్రభుత్వం, యాజమాన్యం నుండి ఎటువంటి స్పందన రాకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాద బాధిత పసుపు రైతుల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి పసుపు రైతుల కష్టాలను వివరించారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాద ఘటనలో రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభు త్వం వైఫల్యం చెందిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ మార్చి ఒకటి నుండి జరగబోయే రిలే నిరాహారదీక్షలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు రూ.100 కోట్లు నష్టం వాటిల్లినా కమిటీ నివేదిక పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం సోచనీయమన్నారు. ఉద్యమాల ద్వారానే రైతుసమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ధర్నాలో జిడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మన్, రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, రాష్ట్ర కమిటి సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, ముద్దన సాంబ శివరావు, కె.బి.ప్రసాద్, హుస్సేన్ వలి, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

హీరా ఇస్లామిక్ స్కూలుకు ఆర్కే చేయూత

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని బాపనయ్య నగర్‌లో గల హీరా ఇస్లామిక్ స్కూల్ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.2 లక్షల నగదును సోమవారం తన సొంత డబ్బులు వైసీపీ నాయకులతో కలిసి స్కూల్ ఆవరణలో అందజేశారు. వైసీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఇక్బాల్, ఎం.సుధారాణిలు స్కూల్ ప్రిన్సిపల్ టి.రామలక్ష్మికి అందజేశారు.

సిద్ధం మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడికొండ : మార్చి 3న మేదరమెట్ల గ్రామంలో జరగ నున్న 4వ విడత సిద్ధం మహాసభను జయప్రదం చేయాలని ప్రత్తిపాడు శాసనసభ్యులు, తాడి కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకతోటి సుచరిత కోరా రు. గుంటూరు నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే రాప్తాడు, భీమిలిలో సిద్ధం మహాసభ విజయవంతమైందని ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సంబంధించి నాలుగవ విడత మహాసభ మేదర మెట్లలో జరుగుతుందన్నారు. 2024 ఎన్నికలలో వైసీపీ ఒంటరి పోరుతో ఎన్నికల బరిలోకి దిగుతుందన్నారు. గడచిన 56 నెలల కాలం లో వైసీపీ చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాలే తమ పార్టీ గెలుపు కు నాంది అన్నారు.

మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళగిరి ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు సోమవారం లోకేష్ నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని, భవనాన్ని ఆధునికరించాలని కోరారు. వైద్యులను, ఉద్యోగుల సంఖ్యను పెంచాలని విన్నవించారు. లోకేష్ స్పందించి మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. రైట్ టు హెల్త్ యాక్ట్ ప్రతిని ఆయనకు అందజేశారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్, నాయకులు ఎం.నాగేశ్వరరావు, సిందే బాలకృష్ణ, బి.రాజేష్ పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతరావును స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు చుట్టుగుంట సెంటర్ వద్ద ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కన్నెగంటి హనుమంతరావు 102వ వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మహిళా నాయకురాలు, డాక్టర్ శనక్కాయల రాజకుమారి కన్నెగంటి హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులలో కన్నెగంటి హనుమంతరావు ఉండటం గొప్ప విషయమన్నారు. నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం ముందుకు సాగాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టటంతోసోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో మంగళగిరి ఫైర్ సిబ్బంది వెంటనే సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకొని ఆ మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

టెన్త్ క్లాస్ ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

ఇబ్రహీంపట్నం మండలం, జూపూడి, కిలేశపురం, గ్రామానికి చెందిన బండి చేతన్, S/o. బి. శ్రీనివాసరావు, అనే నేను దొండపాడు గ్రామంలో నివసిస్తున్నాను. నాకు సంబంధించిన టెన్త్ క్లాస్ ఒరిజినల్ సర్టిఫికెట్ 10-02-2024న జిరాక్సు నిమిత్తం ద్విచక్రవాహనంపై దొండపాడు నుండి తుళ్ళూరు వెళ్తుండగా మధ్యలో పోయినది. సదరు మార్క్‌లిస్టు రోల్ నెంబర్:1812601232. సర్టిఫికేట్ నంబర్:RR705513. కావున మార్క్ లిస్ట్ దొరికిన వారు నెంబర్:9704500953నకు తెలపగలరు.

రైతు సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన

విశాలాంధ్ర-పెదకాకాని : ఢిల్లీ రైతు పోరాటం డిమాండ్స్ నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాత్రాపు సూర్యనారాయణ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపు మేరకు సోమవారం ఉదయం రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్య క్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన మత్రపు సూర్య నారాయణ మాట్లాడుతూ 26వ తేదీ నుంచి 29వ తేది వరకు ప్రపంచ వాణిజ్య సంస్థతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదురుచుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జాతీయ రోడ్డుపై దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఆహార భద్రతకు, రైతు పంటల కొనుగోలు సంస్థలు దెబ్బతినే పరిస్థితి ఉంటుందన్నారు. యావత్తు దేశ ప్రజలకు నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరుగుతాయన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి అందరూ మద్దతు తెలపాలన్నారు. గత వారం నుంచి ఢిల్లీ చుట్టుపక్కల జరుగుతున్న రైతులు పోరాటంలో యువరైతు చనిపోవడం అనేకమంది గాయాలపాలయ్యారన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై విచక్షణరహితంగా దాడులు చేయడం ధ్వంసం చేయటం దుర్మార్గమన్నారు. మద్దతు ధరలు చట్టం చేస్తానని, రైతుకు రెట్టింపు ఆదాయం చేస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ దీనికి భిన్నంగా పార్లమెంట్‌లో దొడ్డిదారిన పార్లమెంట్‌లో 175 చట్టాలు చేసి దొడ్డిదారిన వ్యవసాయ రంగాన్ని, పరిశ్రమలను దెబ్బతీసే విధంగా చేస్తున్నారన్నారు. కార్మికులను దెబ్బతీసే విధంగా లేబర్ తీసుకురావడం జరిగిందని అన్నారు. తొలుత పెదకాకాని గ్రామ సెంటర్ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం సభ జరిగింది. రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా నాయకులు కంచు మాటి అజయ్, సీఐటీయూ జిల్లా నాయకులు నళిని కాంత్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు, జిల్లా నాయకులు పుప్పాల సత్యనారాయణ, సత్యానందం, రైతు కూలి సంఘం నాయకులు దానబోయిన భాస్కర్ రావు, ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్య క్షులు దండా లక్ష్మీనారాయణ, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు, కిసాన్ ఫెడరేషన్ నాయకులు కాలువ శ్రీధర్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షష్టి, ఏఐఎఫ్‌టూయూ నాయకులు కూరపాటి కోటయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు జంగాల చైతన్య, ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు అరణ్ కుమార్, వ్యవసాయ కార్మికజిల్లా అధ్యక్షురాలు కోటేశ్వరి, ప్రసాద్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగా రెడ్డి, జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ మాట్లాడారు. కార్యక్రమంలో కాకు మాను నాగేశ్వరరావు, మహిళా సంఘం జిల్లా నాయకులు రెంటాల కుమారి, పాటిబండ్ల డేవిడ్ రాజు, కె.సత్యనారాయణ, రాజ రమేష్ పాల్గొన్నారు.

నివాసాలకు ఇంటి పన్ను సౌకర్యం కల్పించాలి

– సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక పాతగుంటూరు శివారు ప్రాంతం ప్రగతినగర్ నివాసాలకు ఇంటి పన్ను ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి ప్రగతి నగర్ ఐదో బ్లాక్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ పోరాట ఫలితంగా ప్రగతి నగర్‌కు ఇంటి పన్ను సౌకర్యం కల్పిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని, అరకొర పన్నులు విధించారని అన్నారు. ప్రస్తుతం పన్నులు విధించడం నిలుపుదల చేశారని, వెంటనే అర్హులైన పేదలందరికీ ఇంటి పన్ను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి పైపు కనెక్షన్ ఇచ్చి పేదలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అలాగే సీపీఐ పోరాట ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా సుమారు 1500 మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టడం అయినదని కచ్చా రోడ్లు మాత్రమే నిర్మించాలని రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రగతి నగర్ కన్వీనర్ నూతలపాటి వెంకటేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు యశ్వంత్, ఏసు, ఎలిసాలు పాల్గొనగా ఐదవ బ్లాక్ కార్యదర్శిగా కూరాకుల అప్పమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉద్యోగ చైతన్య యాత్ర చేస్తాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉద్యోగులను చైతన్య పరిచే విధంగా మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న సంఘం కార్యాలయంలో చైతన్య యాత్రపై ఉద్యోగ సంఘాలతో ఆయన సోమవారం చర్చించారు. ఏపీ జీఈఎ సంఘం వైపు ఉద్యోగులు చూస్తున్నారని, చిత్తశుద్ధి గల నాయకత్వం పట్ల ఆశాభావంతో ఉద్యోగులు ఉన్నారని అన్నారు. గత ఉద్యమాన్ని నాయకులు కేఆర్ సూర్య నారాయణపై అక్రమ కేసుపెట్టడం ద్వారా అణచివేశారని ఉద్యోగులు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్నామని మభ్యపెట్టి ఉత్తుత్తి ఉద్యమాలకు పిలుపునిచ్చి ఏపీ సాధించకుండానే ఉపసంహరణ చేయడం పట్ల ఏపీ జేఏసీలోని సభ్య సంఘాలే తమ అసంతృప్తిని బహిరంగంగానే వెళ్లగక్కినట్లు తెలిపారు. ఇక ఉద్యోగుల్లో ఆయా సంఘాలు ఏదో సాధిస్తాయన్న విశ్వాసం కోల్పోయారని, ఉత్తుత్తి ఉద్యమాల ద్వారా ఉద్యోగులను ఎల్లకాలం మభ్యపెట్టలేరని హెచ్చరించారు. ఉద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ వాటా ఉద్యోగి జీతం నుండి రికవరీ చేసిన డబ్బులు నేటి వరకు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రూ.26వేలు కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షాఖాదరి, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, సంయుక్త కార్యదర్శి నాగభూషణం, జాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధంపై మాట తప్పిన జగన్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గత ఎన్నికల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలే చేస్తామని చెప్పి, మాట తప్పి నేడు సొంత కంపెనీల ద్వారా చీప్ లిక్కర్ అమ్మిన ఘనుడు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర (నానీ) తెలిపారు. సోమవారం స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ మద్యం రేట్లను 3 రెట్లు పెచి, 57 నెలల నెలల పాలనలో సుమారు 2 లక్షలు కోట్ల నాసిరకం మద్యం అమ్మి, వాటిద్వారా సమకూరిన లక్షకోట్లు ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు తీసుకెళ్ళాడని ఆరోపించారు.నాసిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డ యువత నిర్వీర్యం అయిపోతున్నారు. మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమతించటం లేదని ప్రశ్నించారు. ఈ నాసిరకం మద్యం పోవాలంటే మహిళల మాంగల్యాలు మంట కలవకూడ దంటే జగన్ రెడ్డిని గద్దె దింపేయాలని కోవెలమూడి రవీంద్ర తెలిపారు.

ప్రజాభిమానం చూరగొన్న నాయకుడు పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ప్రజల్లో మంచి అవగాహన ఏర్పడిందని, ప్రజాభిమానం చూరగొన్న నాయకుడికి ఎప్పుడు ఎదురు ఉండదని మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. పెమ్మసానిని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం రాయపాటి శ్రీనివాస్‌ను కలిశారు. నగర, పార్లమెంటు రాజకీయ స్థితిగతులపై ఇరువురు కాసేపు మాట్లాడుకున్నారు.

డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్‌కు సూపరింటెండెంట్ అభినందనలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హైదరాబాదులో ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగిన 'చర్మ వ్యాధులు-సుఖ వ్యాధులు-లెప్రసీ వ్యాధులు అనే అంశంపై జరిగిన 52వ జాతీయ సదస్సులో పాల్గొని గుంటూరుకు విచ్చేసిన డాక్టర్ శ్రీనివాస్‌ను జీజీహెచ్ సూపరిం టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సోమవారం అభినందించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ డిఎస్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ 'సెక్సువల్లీ ట్రాన్స్‌మిటెడ్ ఇన్ఫెక్షన్స్ అండ్ ప్రెగ్నెన్సీ' అనే అంశంపై ప్రసంగించారు. గర్భిణీ స్త్రీలలో ఇటువంటి వ్యాధులు వస్తాయి. అవి రాకుండా ఉండేందుకు ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలి. ఒకవేళ సుఖ వ్యాధులు వస్తే ఎటువంటి ప్రమాదాలకు దారితీస్తాయి. పుట్టబోయే శిశువుకు లేదా గర్భంలో ఉన్న శిశువుకు ఏ విధమైన ప్రమాదాలు జరుగుతాయి' అనే విషయాలు గురించి ఈ జాతీయ సదస్సులో ఆయన తెలియజేశారు.

జగనన్నకు అండగా కిరణ్‌కు తోడుగా

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన ఎస్టీ యానాది కులానికి చెందిన బాజీకి మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ పదవి దక్కటం సామాజిక న్యాయం వైపు దూసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ అని బాజీ అన్నారు. విశాలాంధ్ర ప్రతినిధి ఆమెతో మాట్లా డగా ఏమి మాట్లాడాలో తెలియదు కానీ ప్రతి మాటలో భావోద్వేగం ఉంది. ఎన్నాళ్లకు తమ సామాజిక వర్గానికి చెందిన వారికి అందలమెక్కించారన్న ఆనందం ఆమెలో ఉంది. పెద్దగా చదువు లేకున్నా అందరితో ఎలా మాట్లాడాలో తెలియకపోయినా ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కిరణ్ ఇచ్చిన ధైర్యం ఉందని ఆమె అన్నారు. నియోజవర్గంలో ఎస్టీ యానాది సామాజిక వర్గానికి ఇంతటి అవకాశం రావడం ఇదే ప్రథమం అని ఆమె అన్నారు. నా ప్రమాణస్వీకారానికి నా సామాజిక వర్గమంతా తరలివచ్చి వచ్చారని వారందరికీ పేరుపేరునా అభినందనలు మనస్ఫూర్తిగా తెలుపుతున్నానని అన్నారు.

టీడీపీలో చేరుతున్నా

– పల్నాడు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

విశాలాంధ్ర-గుంటూరు : టీడీపీలో చేరుతున్నా... ఇన్ని రోజులు మీరు చూపించిన ఆదరాభిమా నాలతో నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా మరోసారి బరిలో దిగే నన్ను మంచి మనసుతో ఆశీర్వది స్తారని భావిస్తున్నానంటూ పల్నాడు నేతలు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజలకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సోమవారం ఓ లేఖలో విజ్ఞప్తి చేశారు. గడిచిన ఐదేళ్లలో నాపై చూపిన ప్రేమ, అభిమానం ఎన్నటికీ మరువలేనిది. మీరందించిన సహాయ సహకారాలతోనే మన పల్నాడులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సాధించుటకు వీలు కలిగింది. నా తదుపరి రాజకీయ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలు పదేపదే అడుగుతున్నారు. ప్రజల మేలు కోరుతూ పల్నాడు ప్రాంత ప్రజల అభివృద్ధికే కట్టుబడుతూ నేను మరలా పల్నాడు నుంచే పోటీచేయబోతున్నాను. త్వరలోనే జిల్లాలో జరగబోయే భారీ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీలో చేరుతున్నాను. ఐదేళ్లలో సవాళ్లను సోపానాలుగా స్వీకరించి పల్నాడు ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేసా... ఇప్పుడు మరోసారి అవకాశం ఇస్తే దాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని మీకు మాట ఇస్తున్నానంటూ లేఖలో పేర్కొన్నారు.

నూతన నిబంధనలు రద్దు చేయాలి

– ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం వినతి

విశాలాంధ్ర-మంగళగిరి : 60 శాతం అర్హులైన చేనేత కార్మికులకు పింఛన్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఉత్తర్వులు జారీ చేయడంతో తమకు జనవరి నెల నుంచి వృద్ధాప్య పెన్షన్ వస్తుందని సంతోషపడిన చేనేత కార్మికులకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనల వలన కార్మికులు నిరాశకు గురయ్యారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ) మంగళగిరి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అందజేసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అధ్యక్ష, కార్యదర్శులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహన్‌రావు, బత్తులగిరిదొడ్డి ఈశ్వరరావు, నాయకులు కొల్లి కిషోర్ తదితరులు ఉన్నారు. పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పింఛన్ పొందుటకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పింఛన్ పొందలేకపోతున్నారన్నారు. కొత్త నిబంధనల ప్రకారం చేనేత కార్మికులు పెన్షన్ పొందాలంటే రెండు సంవత్సరాల పాటు వస్త్రాల తయారీకి అవసరమైన నూలు కొనుగోలుకు సంబంధించి జీఎస్టీ బిల్లులు చెల్లించి ఉండాలని, ఆన్‌లైన్ ద్వారా వేతనాలు పొందుతున్నట్లు బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు తప్పనిసరి అని చెప్పటం బాధాకరమని అన్నారు. సహకార సంఘాల్లోనూ, మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేస్తున్న కార్మికులు ఎప్పటికప్పుడు మజూరీలు తెచ్చుకుంటేనే కుటుంబ పోషణ అంతంత మాత్రంగా ఉంటున్న చేనేత కార్మికులకు ఆన్‌లైన్ ద్వారా వేతనాలు పొందాలని, జీఎస్టీ చెల్లింపు బిల్లులు చూపమనడం సరైన విధానంకాదని అన్నారు. 50 సంవత్సరాలు నిండి, గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్క చేనేత కార్మికునికి పింఛన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : బాలికలు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని రోటరీ క్లబ్ ఆఫ్ త్రివేండ్రం సౌత్ రోటేరియన్ బీపీ బిజు అన్నారు. సోమవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కృష్ణవేణి ఎగ్జిబిషన్ సొసైటీ పాలిటెక్నిక్ కాలేజీలో విద్య ద్వారా బాలికల సాధికారత అనే కార్యక్రమం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. బిజు మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. కేవలం ఉద్యోగాల కోసం చదవడం కాకుండా తమ టాలెంట్‌ను బయటకు వెలికితీయాలని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోటరీ అనేది బాలికలు చదువుకోడానికి ప్రోత్సహిస్తుందన్నారు. మూడు నాలుగు కిలోమీటర్లు చదువుకోడానికి వచ్చే బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చంద్ర ఓబులారెడ్డి, గొల్లపల్లి శ్రీలత, రావూరి రమేష్ బాబు, శంకర్ శెట్టి రమేష్, శ్రీనివాసరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిల్వర్ జూబ్లీ భవనానికి శంఖు స్థాపన చేయనున్న త్రిపుర గవర్నర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హిందూ ఫార్మశీ కాలేజీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న సాయంత్రం 3.30 నిమిషాలకు కాలేజీ ఆవరణలో సిల్వర్ జూబ్లీ భవన నిర్మాణానికి శంఖు స్థాపన చేసేందుకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి వస్తునట్లు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధు సూధనరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాల సమావేశ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హిందూ ఫార్మశి కాలేజీకి వస్తున్న నేపథ్యంలో ఫార్మశీ విద్యార్థులతో ఇంటరాక్ట్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో సత్సంబంధాలు ఏర్పరచుకుని ఫార్మశీ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కొండా రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందరాజన్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు వృత్తి పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో లక్ష్మీనరసింహా గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ తరుపున మంగళగిరి షరాఫ్ బజార్ బజారులోని స్వర్ణకారుల స్వయం ఉపాధికి సోమవారం వృత్తిపరమైన పరికరాలను అందజేశారు. 21 మంది స్వర్ణకారులకు రూ.3 లక్షల విలువైన వృత్తి పరికరాలను సొసైటీ అధ్యక్షుడు గుంటి నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకుల ద్వారా వృత్తిదారులకు అందజేయించారు. వృత్తిపరికరాలు కావాలని సొసైటీ ద్వారా నారా లోకేష్‌కు ఆర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించి పనిముట్లు అందజేసినందుకు లబ్ధిదారులు లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, సొసైటీ ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ని కలిసిన చిల్లపల్లి

విశాలాంధ్ర-తాడేపల్లి: జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మంగళగిరి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నారా లోకేష్‌ని సోమవారం ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావును కలిశారు. పొత్తుధర్మంలో భాగంగానే కలిశామని జనసేన, టీడీపీ కలిసి పనిచేయటం కోసమే ఈ కలయిక అని చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మంగళగిరి నియోజకవర్గ జనసేన కోర్ కమిటీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

మార్చి 3న పల్స్ పోలియో

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: 0-5 సంవత్సారాల వయస్సు గల పిల్లలందరికి మార్చి 3 వ తేదిన పల్స్ పోలియో చుక్కలు వంద శాతం వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి అధికారులను కోరారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షతన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది లాగే పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా జిందాల్ పవర్ ప్రాజెక్ట్ ప్రాంతం సమీపాన ర్యాట్ పిక్కర్స్ వున్నారని, అదే విధంగా తాడేపల్లిలోని ముగ్గురోడ్డు సాయిబాబా మందిరానికి ఎదురుగా వున్న ప్రాంతంలోని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు తప్పక అందించాలని తెలిపారు. జిల్లా వైద్య శాఖాధికారిణి డా.విజయలక్ష్మీ వివరించారు. పోలియోచుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి ఇంటింటికి వెళ్లి మరుసటి రోజు నుండి వేయడం జరుగుతుందని తెలిపారు. పల్స్ పోలియోపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ స్వాతి, ఆర్డిఓ పి.శ్రీఖర్, డియంఅండ్‌హెచ్ఓ డా.విజయలక్ష్మీ, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి కే.వి.సుబ్బరాజు, ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డా.శ్రావణ బాబు, డిపిఎంఓ డా.రత్నమన్మోహన్, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ విజయ్ ప్రకాష్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్న పాలన వైద్య రంగానికి ఒక వరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జగనన్న పాలన వైద్య రంగానికి ఒక వరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరులోని సెయింట్ జోసెఫ్ జనరల్ ఆస్పత్రిని మంత్రి విడదల రజిని సోమవారం సందర్శించారు. మంత్రి ఆసుపత్రిలోని పలు వార్డులను కలియతిరిగారు. జేఎంజే సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సెయింట్ జోసెఫ్ ఆసుపత్రి సేవలు ఆదర్శనీయంగా ఉన్నాయని అన్నారు. పేదలకు అతి తక్కువ ఖర్చులో వైద్యం అందిస్తుండటం గొప్ప విషయమని, ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. నేడు నిరుపేదలు ధైర్యంగా పెద్ద ఆసుపత్రులకు వెళ్లి ఉచితంగా వైద్యం చేయించుకునే పరిస్థితి నెలకొనడం సీఎం వైఎస్ జగన్ వల్లనేనని స్పష్టం చేశారు. హాస్పిటల్ నిర్వాహకురాలు సిస్టర్ గ్లాడి, హాస్పిటల్ ఇన్‌ఛార్జ్ సిస్టర్ శౌరీ, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, చైర్‌పర్సన్ డాక్టర్ ఆని, సిస్టర్ జూలి, సీనియర్ సిస్టర్లు, పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మార్చి 3వ తేదీన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరులో జరిగే సిద్ధం సభను ప్రజలంతా కలిసి కట్టుగా విజయవంతం చేయాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నూరి ఫాతిమా పేర్కొన్నారు. సోమ వారం ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో సిద్ధం సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నాయకులు సిద్ధం సభకు వస్తున్న జనసంద్రాన్ని చూసి ఓటమి ఖాయమని భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్తఫా, గుంటూరు తూర్పు అసెంబ్లీ పరిశీలికులు మిట్టపల్లి రమేష్ బాబు, అంజుమాన్ గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్షులు అబ్దుల్ కర్నూమా, నరసరావుపేట అసెంబ్లీ పరిశీలికులు గులాం రసూల్, పార్టీ నాయకులు వాకా శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు కోలా భవాని, మనోరంజని, కార్పొరేటర్లు, వివిధ శాఖల చైర్మన్స్, డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

175 స్థానాల్లో గెలిపించేందకు ప్రజలు సిద్ధం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు చంద్రమౌళి నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సిద్ధం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. గత ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా చేస్తూ పరిపాలన కొనసాగించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని, మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా 99 శాతం అమలు చేసిన ఘతన తమకే దక్కుతుందని వివరించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతా రామాంజనేయులు, డిప్యూటీ మేయర్ వజ్రబాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, మహిళా విభాగం గుంటూరు నగర అధ్యక్షురాలు ఝాన్సీ, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు అంగడి శ్రీను, అన్ని డివిజన్ల అధ్య క్షులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, ఆయా విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసేలా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలసి పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్లు, జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఓటరు దరఖాస్తుల పరిష్కారం, రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు తూర్పు, పశ్చిమనియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బిఎల్ఓ సహకారంతో మౌలిక వసతుల కల్పన పై సూపర్వైజరి అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరంలోని రైల్ పేట, సీతా రామ్ నగర్, మంగళ్ దాస్ నగర్, ఇజ్రాయిల్ పేట, వెంకట్రావ్ నగర్, సంగడి గుంట, ఐపిడి కాలనీ, పొన్నూరు రోడ్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కమీషనర్ అధికారులతో కలిసి పరిశీలించి మౌలిక వసతుల ఏర్పాటుపై తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంపై ఏర్పాట్లు పూర్తి అయినట్లు బిఎల్ఓ సూపర్వైజరి అధికారి లిఖితపూర్వక నివేదిక ఇవ్వాలన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు, పాల్గొన్నారు.

లోకల్ శివన్న ఎన్నికల ప్రచారం షురూ

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి నియోజకర్గంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత భారీ మెజారిటీతో గెలుపుని ప్రసాదించాలని సోమవారం కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఐతానగర్‌లోని పేరంటాళ్ళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి 1,2 వార్డుల పరిధిలోని ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకొని తమ ప్రభుత్వ పనితీరును, ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధికా రమేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

స్పందనకు 128 ఫిర్యాదులు

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో డాక్టర్ బిఆర్ స్పందన హాలులో "జగనన్నకు చెబుదాం" స్పందన ఫిర్యాదుల కార్యక్రమానికి 128 మంది తమసమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందచేశారు. కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి బాధితుల నుండి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఆర్జీల పై జిల్లా కలెక్టర్ సంబతిత శాఖల అధికారులతో మాట్లాడుతూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అర్జీదా రుల్లో 128 ఫిర్యాదులు అందినట్లు జిల్లా కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. అర్జీదా రులు సుదూర ప్రాంతాల నుంచి రావడంతో, వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా వారి సహకారంతో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని 181 నుంచి 193 పోలింగ్ కేంద్రాల సెక్టార్ ఆఫీసర్ పి.శివ ప్రసాద్ సోమవారం సందర్శించారు. ఆయన నెహూనగర్ తండాలో ఉన్న 187 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో పోలింగ్ నిర్వహించేందుకు మౌలిక వసతుల్లో భాగమైన వెలుతురు, ఫర్నిచర్, వికలాంగులకు ర్యాంప్, త్రాగునీరు తదితర సదుపాయాల వివరా లను బూత్ లెవల్ అధికారి వెంకటరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ లోపు వసతులు సిద్ధంగా ఉండాలని ఆయన బిఎల్వోలకు సూచించారు.

ప్రజా ఉత్తమ సేవలు అందించాలి : ట్రైనీ కలెక్టర్

విశాలాంధ్ర-నూజెండ్ల: ప్రభుత్వ ఉద్యోగులందరూ క్రమం తప్పకుండా విధులకు వస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ముందుగా మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముప్పరాజు వారిపాలెం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరు, రికార్డులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పాలన చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వీరభద్రాచారి, ఈవోపీఆర్డి రవికుమార్, డిప్యూటీ తహసిల్దార్ అర్జున్ నాయక్, మండల సర్వేర్ చండీరాణి, పంచాయతీ కార్యదర్శి రబ్బాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాబోయేది చంద్రన్న పాలనే : బ్రహ్మ రెడ్డి

విశాలాంధ్ర-రెంటచింతల: గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాత్రమే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేసిందని మాచర్ల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తుమ్మకోటలో ఆయన ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన బ్రహ్మారెడ్డికి మహిళలు మంగళహారతులతో, కార్యకర్తలు బాణసంచా కాల్పులతో ఘన స్వాగతం పలికారు. తనకు అర్థ బలం లేకపోయినా అంగ బలం ఉందని గ్రహించి నా రాజకీయ ఎదుగుదలకు తోడ్పడుతున్న తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అంతులేని అవినీతితో అభివృద్ధికి దుర్గతి పట్టి వివిధ అభివృద్ధి కార్యక్రమాలన్నీ అటకెక్కాయన్నారు. వైసీపీ పాలనకు చరమ గీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించి కూటమి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమ ంలో లింగా పున్నారావు, పోట్ల సైదారావు, మాధవరావు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణ పరిధిలోని పెద్ద తురక పాలెం గ్రామంలో రూ.9.51 లక్షలతో నిర్మించిన ఏపీ గిరిజన బాలికల వసతి గృహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ శివశంకర్,ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ప్రారంభించారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ క్లబ్ సముదాయంలో నిర్వహించిన సభలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, యోగా ప్రదర్శన, ఒక నిమిషంలో 100 సైంటిస్టుల పేర్లు విద్యార్థిని చదివి వినిపించారు. దింసా నృత్య ప్రదర్శన అలరించింది. జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డి.టి.డబ్ల్యూ.ఓ వరలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ సహాయ కార్యదర్శి, గ్రామస్తులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

రూ.60 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-వెల్దుర్తి : మండల పరిధిలోని బోదిలవీడు గ్రామంలో రూ.40 లక్షల మైనింగ్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మాచర్ల శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామ కృష్ణా రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజల వసతికోసం కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయడంలో జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిపేద, బడుగు, బలహీన వర్గాలు ఇబ్బందులు పడకుండా అండగా వైసీపీ ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అండగా ఉండాలని కోరారు. పంచాయతీ రాజ్ డీఈ పాశం శ్రీనివాస్ రెడ్డి, మండలాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

అమృత్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో సోమవారం జరిగిన ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు పాల్గొన్నారు. అమృత్ భారత్ పదకంలో బాగంగా దేశవ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జి, అండర్ పాసస్లను ప్రధాని ప్రారంభించారు. రైల్వే స్టేషన్లో జరిగిన ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, రైల్వే అధికారులు పాల్గొన్నారు. నరసరావుపేట రైల్వే స్టేషను ఆధునీకరణ శుభ పరిణామమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు.

కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-నరసరావుపేట: మార్చి నెలలో శివరాత్రి పండుగ సందర్భంగా కోటప్పకొండలో జరగనున్న తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాట్లను ఎస్పీ రవి శంకర్ రెడ్డి సోమవారం పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. తిరు నాళ్ళకు పోలీస్ అధికారులు సన్నద్ధంగా వుండాలని ఆదేశించారు. తిరునాళ్ళకు సంబంధించి భక్తులకు కల్పిస్తున్న ఏర్పాటు, వాహన రాకపోకలు, వాహనాల పార్కింగ్, భక్తుల కోసం క్యూ లైన్ల ఏర్పాటు, ప్రభలు నిలుపు ప్రదేశాలు ముందస్తు ప్రణాళిక రూపొంది ంచుకోవాలనీ పోలీస్ అధికారులకు సూచించారు. ఎక్కడా యెటువంటి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవకుండా ఉండేందుకు తగిన చర్యలు తెసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) శ్రీ రామచంద్ర రాజు, నరసరావుపేట డిఎస్పీ విఎస్ఎన్ వర్మ, ఎస్బి సీఐలు ప్రభాకర్, బలనాగిరెడ్డి, నరసరావుపేట రూరల్ సీఐ మల్లికార్జున రావు, ఎస్సై రోశయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు హంతకుడు... కార్మిక ద్రోహి నరేంద్ర మోదీ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఢిల్లీ సరిహద్దులలో నిరసన తెలుపుతున్న రైతులపై దాడులు చేపించిన, చంపిన రైతు హంతకుడు, కార్మిక ద్రోహి నరేంద్ర మోదీని సాగనంపాలని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గద్దె చలమయ్య అన్నారు. రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రద్దు చేస్తానన్న నల్లచట్టాలను దొడ్డిదోవలో అమలు చేస్తున్న నరేంద్ర మోదీకి నిరంకుశ విధానాలకు ఢిల్లీ సరిహద్దులలో నిరసన తెలుపుతున్న రైతులపై దాడులు చేపించి చంపించడం అన్యాయమని అన్నారు. రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సత్తెనపల్లి లోని జాతీయ రహదారిపై బైక్ ప్రదర్శన, మోదీ శవ యాత్ర జరిగింది. స్థానిక సెంటర్‌లో జాతీయ రహదారిపై మోదీ దిష్టి బొమ్మను దగ్ధంచేయడం జరిగింది. స్థానిక తాలూకా సెంటర్‌లో జరిగిన సభా కార్యక్రమానికి రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సభలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.మల్లేశ్వరి, కౌలు రైతు సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి పి.మహేష్, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.వీరబ్రహ్మం, ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ, జై భీమ్ రావు భారత్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జొన్నలగడ్డ విజయ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఇర్మియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మూర్తి, కౌలు రైతు సంఘం క్రోసూరు మండల నాయకులు టి.హనుమంత రావులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ఢిల్లీ సరిహద్దులలో శాంతి యుతంగా పోరాటం చేస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మక్కపాటి నరసింహారావు, రావూరి పూర్ణచంద్రరావు, సూరిబాబు, కంచర్ల నాగేశ్వరరావు, కందిమళ్ళ శివ, రొంపిచర్ల పురుషోత్తం, జి.రజిని, సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఇ.లింగయ్య, జడ రాజకుమార్, షేక్‌మస్తాన్‌వలి, డి.వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నాం : మాజీ ఎమ్మెల్యే మక్కెన

విశాలాంధ్ర-వినుకొండ : రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడు ద్వారానే సాధ్యపడు తుందని నమ్మి తెలుగుదేశం పార్టీలోకి వెళుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రకటించారు. తనతో పాటు వినుకొండ నియోజక వర్గంలోని తన బృందం అంతా టీడీపీలోకి వచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రకటిస్తూ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని సోమవారం తన నివాసంలో కలిసి నిర్ణయాన్ని తెలపడంతో మక్కెన మల్లికా ర్జున్‌రావు, జీవీ ఆంజనేయులును సాదరంగా ఆహ్వానించారు. మక్కెన మాట్లాడుతూ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, తాను జీవి ఆంజనేయులు నేతృత్వంలో త్వరలో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. జనసేన టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా జీవి ఆంజనే యులు ప్రకటించడం పట్ల వారికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ మంచి మెజార్టీతో గెలిపిం చేందుకు సమిష్టిగా పని చేస్తామని తెలిపారు. వైసీపీని వీడి టిడిపిలో చేరటానికి గల అవశ్యకతను ఆయన వివరించారు. రాష్ట్రంలో పోలవరం, హైవే రహదారులు, పరిశ్రమలు, ప్రాజెక్టు లాంటి పూర్తిచేసుకుని రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే చంద్రబాబు నాయుడుని సీఎం చేసుకోవడం ద్వారానే సాధ్యపడుతుందని నమ్మి పార్టీలోకి రావడం జరుగుతుందన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధమన కాండ, దౌర్జన్యాలు, దుర్మార్గాలు పెరిగిపోయాయని వినుకొండలో లా అండ్ ఆర్డర్ లేదన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, తన సమక్షం లోనే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఒక రైతు నరేంద్ర పై చెప్పుతో దాడి చేయబోయి అతనిపై అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టించి జైల్లో పెట్టించారని, మాచర్ల సీఎం ప్రోగ్రాంలో డాక్టర్ లతీష్‌రెడ్డిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇష్టానుసారంగా దుర్భాషలాడి దృష్టిగా వ్యవహరిం చడం వాస్తవం అన్నారు. ఇవి కాదని అంటే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వారి నివాస గ్రామం వేల్పూరులో తన ఇష్ట దైవమైన వెంకటేశ్వర స్వామి గుడిలో కొబ్బరికాయ కొట్టి ప్రమాణానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. గతంలో ఏ ఎమ్మెల్యే వినుకొండను అభివృద్ధి చేయలేదని, వ్యక్తిగత దూషణలు సరికాదని ఎమ్మెల్యే బొల్లాకు ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెట్టే వారన్నారు. గుండ్లకమ్మ పై తంగిరాల డాం నిర్మిస్తానని హామీ ఇచ్చి అధికారంతో హడావిడి చేసి నూజెండ్ల వినుకొండ ప్రజలను మోసగించారన్నారు. ఒరికపాడిశల ప్రాజెక్టు పూర్తి చేయకపోతే ప్రజలకు తాను మొహం చూపించమని దగా చేసాడన్నారు. వినకొండకు తెస్తానని చెప్పిన పరిశ్రమలు, కళాశాలలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ఇసుక, మట్టి, మద్యం మాఫియాలే కాకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శిం చారు. జనసేన టీడీపీ సంయుక్త అధికారంలోకి రాగానే వల్ల అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి జైలుకు పంపించడం ఖాయమని అన్నారు. సమావేశంలో..టీడీపీ నాయకులు లగడపాటి వెంకట్రావు, షమీంఖాన్, పివి సురేష్ బాబు, మక్కెన కొండలరావు, గంధం కోటేశ్వర రావు, పటాన్ అయుబ్ ఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

అవినీతికి ఆస్కారం లేకపోవడంతోనే టీడీపీలో చేరారు

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికా ర్జునరావులు ఇద్దరూ తోడు దొంగలుగా మారి కోట్లాది రూ.ల ప్రజాధనాన్ని దోచుకున్న వారే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ఉంటూ అవినీతికి ఆస్కారం లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే మక్కెన టీడీపీలో చేరారన్నారు. గతంలో నియోజకవర్గంలోని చేపల చెరువులన్నీ తన ఆధీనంలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడే చెరువుల్లో కూడా చేపలను పెంచి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న విషయం ప్రజలందరికి తెలుసన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చేపల వ్యాపారం యధేచ్ఛగా చేశారని, తోడు దొంగలు అనడానికి ఇదే నిదర్శమన్నారు. 750 ఎకరాల విస్తీర్ణం ఉన్న నడిగడ్డ చెరువును 10 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కోర్టుల్లో కేసులు వేయించి ఆ పథకం అమలు కాకుండా మాజీఎమ్మెల్యే మక్కెన కుట్రపూరితంగా చేపలు పెంచుకున్నారని ఆరోపించారు. అలాగే కొండ్రముట్లపాలెం, పెదకంచర్ల, ముక్కెళ్లపాడు, చెరువుల్లో కూడా తనదైన శైలిలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని చెప్పారు. ఒక్క పెదకంచర్ల చెరువు 20 ఏళ్లు తన ఆధీనంలో ఉంచుకొని ఏడాదికి రూ.2 కోట్లు సంపాదించు కున్నాడని అన్నారు. ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలకు నీరు లేకపోయినప్పటికీ పెదకంచర్ల చెరువు నుంచి ప్రైవేటు చేపల చెరువులకు నీరు తరలించడం ఎంతవరకు సబబు అన్నారు. మరలా టీడీపీని గెలిపిస్తే వీధికొక బినామీ ఎమ్మెల్యేగా మారి ప్రజా ధనాన్ని దోచుకుంటారని విమర్శించారు. నకిలీ బయో ఎరువులు, మొక్కల పేరుతో రైతులను మోసం చేసిన ఘనత జీవీకే దక్కుతుందన్నారు ప్రమాణా నికి సిద్ధం కావాలి... తాను రైతును చెప్పుతో కొడతానని అనకపోతే ప్రమాణానికి సిద్ధమా అని వ్యక్తిగత విమర్శలు చేసిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మాటలకు ఎమ్మెల్యే బొల్లా కౌంటర్ ఇచ్చారు. ప్రజాధనం లూటీ కాకుండా గ్రామాల అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నామని, అది నచ్చని వారు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయియాదవ్, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, మట్టి రాజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లాలో లేబర్ సెస్ తప్పకుండా సేకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో కార్మికుల సంక్షేమం కోసం లబర్ సెస్సు తప్పకుండా సేకరించాలని కార్మిక శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయములోని స్పందన హాలులో లేబర్ సెల్ సమన్వయ కమిటి సమావేశం కలక్టర్ శివ శంకర్ లోతేటి అధ్యక్షతన సోమవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సంబందిత శాఖలు లేబర్ సెస్‌ను తప్పక సేకరించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల పర్యటనలో సంబందిత అధికారులతో లేబర్ సెస్‌పై సమీక్షించాలని సూచించారు. భవన నిర్మాణ, ఎ ఇతర నిర్మాణ రంగములో నైనా విధిగా సెస్ సేకరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ శ్యాం పసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, డిప్యూటి కమీషనర్ ఆఫ్ లేబర్ గాయత్రి దేవి, సహాయ కమీషనర్ ధనలక్ష్మి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సాధికార సారధులకి శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-వినుకొండ : జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా సోమవారం వినుకొండ పట్టణంలోని గంగి నేని ఫంక్షన్ హాల్‌లో శావల్యపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన కుటుంబ సాధికార సారధులకి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీవి. ఆంజనేయులు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ గెలుపే లక్ష్యంగా అందరు సమిష్టిగా సైనికుల పనిచేయాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్య క్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు కోరారు. సోమవారం కుటుంబ సాధికార సాధకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా జీవి ఆంజనేయులు హాజరై పలు సూచనలు చేశారు. ఎన్నికలు వరకు ప్రతి ఒక్కరూ ప్రజల్లోనే ఉండాలని తెలిపారు. మండల టీడీపీ నాయకులు యరమాసు కోటేశ్వరరావు,గడిపుడి విశ్వనాథం, గోరంట్ల హనుమంత రావు, అమృతపూడి కోటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు, ఎక్స్ జెడ్పిటిసి రవి కుమార్, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు బోడేపూడి శంకర్, చింత గంగయ్య, గోనుగుంట్ల ధనుంజయ్ సంగం డైరీ డైరెక్టర్ గడిపూడి రామాంజనేయులు, పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-వెల్దుర్తి : మండల పరిధిలోని బోదిలవీడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి తిరుణాల ఘనంగా జరిగింది. వేద పండితులు స్వామి వారికి హోమాన్ని నిర్వహించారు. గ్రామంలోని జంటలు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. మేడ తాళాలు డబ్బు వాయిద్యాలతో స్వామివారిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. వేసవికాలాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు, మజ్జిగ, సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేటియువత ఆధ్వర్యంలో జవ్వాజి సుబ్బయ్యకు ఘన సత్కారం

విశాలాంధ్ర - నరసరావుపేట : మండల కేంద్రమైన నకరికల్లు నందు ఇటీవల పల్నాడు జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నేటియువత గ్రూపు సభ్యులు జవ్వాజి వెంకట సుబ్బయ్యను ఆదివారం నేటియువత వ్యవస్థాపకులు షేక్.నాగూర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గ్రూపు సభ్యులు అధిక సంఖ్యలో హాజరై సుబ్బయ్యను ఘనంగా సత్కరిం చారు. నకరికల్లులో నేటి యువత అనే వాట్సాప్ గ్రూపులో కీలకమైన సభ్యులుగా ఉన్న జవ్వాజి వెంకట సుబ్బయ్యకు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడుగా ఇవ్వటం చాలా ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో ఇంకా మరెన్నో పదవులు పొందాలని వారు తెలిపారు. ప్రతి ఒక్కరికీ చేతనైనంతవరకు సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. నేటియువత సభ్యులు నన్ను సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేటియువత సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర- తెనాలి : ఏ రూపంలో అశ్లీలత ఉన్నా దాన్ని తీవ్రంగా ప్రతిఘటించవలసిన అవసరం ఉందని అశ్లీలతా ప్రతిఘటన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ప్రజాసాహితి పత్రిక సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం, అశ్లీలతా ప్రతిఘటన వేదిక ఆధ్వర్య ంలో స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో అశ్లీలతా ప్రతిఘటన వేదిక వ్యవస్థాపకుడు ఈదర గోపీచంద్ సంపాదకత్వంలో వెలువడిన కామోత్సవ దహనం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించి ప్రసంగించారు. రవిబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 1987 ప్రాంతంలో ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ రచించగా ఒక వారపత్రికలో ధారావాహికగా వచ్చిన కామోత్సవ్ అనే అశ్లీల రచనను ప్రతిఘటిస్తూ వ్యాసాలు రాసినందుకు తమపై కేసులు నమోదు చేసినప్పటికీ అవి వీగిపోయాయని రవిబాబు అన్నారు. ఫిబ్రవరి 26 అశ్లీలతా ప్రతిఘనట వేదిక ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు ఈదర గోపీచంద్ తెలిపారు. అశ్లీల ప్రతిఘనట వేదిక రాష్ట్ర కార్యదర్శి బీరం సుందరరావు మాట్లాడుతూ నేడు సెల్‌ఫోన్ లలో వస్తున్న అశ్లీల చిత్రాలు యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయని, వాటిని ప్రతిఘటించవలసిన అవసరం ఉందన్నారు. సభలో అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగా, విశ్రాంత ప్రొఫెసర్ బి. లలితానంద ప్రసాద్, ఏఐటియుసి సీనియర్ నేత పరుచూరి వెంకటేశ్వరరావు, రచయితలు కె. నారాయణమూర్తి, ఐనాల మల్లేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

జంపు జిలానీలు... నిలకడగా నిలిచేనా...?

- వలసలన్నీ వాస్తవాలేనా...?
- వలసలకు కారణం భయమా.. అభిమానమా.. లేక అవసరాల కోసమా...
- పార్టీలు మారిన కార్యకర్తలు సమిధలా... ప్రమిధలా....

విశాలాంధ్ర-రొంపిచర్ల: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుంది... రాజకీయ పార్టీల నాయకులు వారి వారి పార్టీల గెలుపు కోసం పార్టీ బలోపేత కార్యాచరణ చేపట్టి పొరుగు పార్టీలలో పనిచేసే కార్యకర్తలను చేర్చుకునే ప్రయత్నాలు చేస్తుండం సహజం. ఇందులో భాగంగా పార్టీల వలసలు ముమ్మరమవుతూ కార్యకర్తలు కండువాలు మార్చుకుంటున్నారు. అయితే పార్టీ మారిన కార్యకర్తలు కండువాలు మార్చుకున్నంత సులువుగా మనసు మార్చుకొని ఇప్పటివరకు కొనసాగిన పార్టీని కాదని కొత్తగా కండువా కప్పుకున్నంత మాత్రాన ఆపార్టీకి ఓటు వేయగలరా అనేది అర్థం కాని ప్రశ్న. వాస్తవానికి వ్యక్తిగతంగా ఆలోచిస్తే అభిమానం వెలకట్టలేనిది. అంత ˘టి అభిమానాన్ని చంపుకొని ఇప్పటివరకు పాలిచ్చి పెం చిన తల్లి లాంటి పార్టీని వీడి మరొక పార్టీకి ఓటు వేయ గలరా..? అయితే చేరిన పార్టీకండువాలు కప్పుకున్న తర్వాత ఇప్పటివరకు వారు కొనసాగిన పార్టీలో ప్రాధాన్యత తగ్గించారనో, ఆ పార్టీ విదివిధానాలు నచ్చ లేదనో లేక కొత్తగా చేరిన పార్టీ విధివిధానాలు నచ్చడం లాంటి కారణాలు సాకుగా చెప్పుకొస్తారు. కానీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకుల వత్తిళ్లు తట్టుకోలేక భయంతో పార్టీకండువాలు కప్పుకోవాల్సి వస్తుందని కూడ పార్టీలు మారిన కొందరు కార్యకర్తలు చెప్పుకుంటు ంటారు. 2019 సార్వత్రిక ఎన్నికల అనంత రం వైసీపీ అధికారంలోకి రావడంతోనే అప్పటివరకు టీడీపీలో బలమైన నాయకులుగా చలామణి అయ్యి పద వులు అనుభవిం చిన ద్వితీయ శ్రేణి నాయకులు సైతం పాలిచ్చి పెంచిన తల్లి రొమ్ముగుద్దినట్లు ఆపార్టీని వీడి వైసీపీ తీర్థం పుచ్చుకొని ఈ పార్టీ అందించే ప్రతిఫలాలు అనుభవిస్తూ వస్తున్న నాయకులు రానున్న ఎన్నికల్లో ఈపార్టీలో అనుభవించిన దానికంటే సుదీర్ఘకాలంగా తల్లి పార్టీలో పొందిన ఫలాలు, ఆపార్టీ ఇచ్చిన ప్రాధాన్యతను బట్టి వారు అప్పుడు అనుభవించిన ఆ విలాసవంతమైన స్వేచ్ఛా జీవితం, ఆ ఆనందం గుర్తుకొచ్చి తిరిగి వారి సొంత గూటికి చేరుతున్నారు. అంతేకాదు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి చేరడమో లేక రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటే ఆ పార్టీలోకి చేరి కండువాలు కప్పుకోవడంకూడా సహజమే. అయితే ఏ పార్టీనైతే వీడి మరో పార్టీలో వారు చేరుతారో వారు వీడిన పార్టీ అధికారంలోకి వస్తే వారు సమిధలుగా మిగిలినట్లే...అలా కాకుండా వారు చేరిన పార్టీ అధికారం లోకి వస్తే వారు ఆపార్టీలో ప్రమిధలుగా వెలుగుతారన్న మాట వాస్తవం. అయితే పార్టీలు మారే కార్యకర్తలు వారి మనస్సాక్షిని చంపుకొని రాలేరనేది జగమెరిగిన సత్యం. దీనిని బట్టి జంపు జిలానీలు నిలకడగా నిలుస్తారా.. అసలు వలసలన్నీ వాస్తవాలేనా, అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. అంతేకాదు పార్టీలు మారిన జంపు జిలానీలు కొందరు గత పార్టీ నాయకులతో వారు కలుసుకున్నప్పుడు అప్పటి విశేషాలను నెమరు వేసుకుంటుండడం ఆసక్తికర విషయం.

బాల్య వివాహాలు చేయడం నేరం

విశాలాంధ్ర-నూజెండ్ల: బాల్య వివాహాలు చేయడం నేరమని, వీటిని చేసేవారితో పాటు ప్రోత్స హించే వారిపై కూడా కేసులు నమోదు చేస్తారని ఐసిడిఎస్ సూపర్వైజర్ విన్యాసమ్మ అన్నారు. సిడిపిఓ అనురాధ ఆదేశాల మేరకు సోమవారం రవ్వారం పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివా హాల నిషేధిత చట్టం ప్రకారం అబ్బాయిలకు 21 అమ్మాయిలకు 18 నిండే వరకు వివాహాలు జరిపించకూడదన్నారు. బలవంతపు, ఇష్టం లేని వివాహాలు జరిపినా జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తార న్నారు. వివాహవయసు వచ్చేవరకు అందర్నీ చదివించాలని పేర్కొ న్నారు. బాల బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పై అవగాహన కల్పించి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు కృష్ణారావు, కార్యకర్తలు లక్ష్మీ రాజ్యం, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఐసిడియస్ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు లింగ వివక్షత, బాలల హక్కు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడియస్ సూపర్ వైజర్లు కె.శశిదేవి, డి.దేవీభాయి, ఎస్ కె. షమీమ్ సుల్తానా మాట్లాడుతూ సమాజములో బాలబాలికలు అందరూ సమానులేనని అన్నారు. బాలికలు విద్యవలన అన్ని రంగాలలో రాణిస్తారని అన్నారు. బాలికలకు చిన్నతనంలో వివాహాలు చేయటం వల్లన వారికి మానసిక, శారీరక ఎదుగుదల లేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. బాలికలకు 18 సంవత్సరములు, బాలురకు 21 సంవత్సరములు దాటిన తరువాత వివాహములు చేయాలని అన్నారు. కిషోర బాలికలు రక్తహీనత నివారణకు తీసుకోవలసిన పోషకాహారము గురించి వివరించారు. అదే విధంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లు గురించి, బంగారు తల్లి పథకము గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ నెం.1098 గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యు.సీతమ్మ, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ పి.బాలశౌరీలు, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహుకరణ

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సోమవారం ప్రింటర్ బహుకరణ కార్యక్రమం జరిగింది. ఆ గ్రామ మాజీ సర్పంచ్ వరికూటి ఓబుల్‌రెడ్డి జ్ఞాపకార్థము వారి కుమారుడు వరికూటి శ్రీనివాసరెడ్డి ప్రింటర్ బహుకరించారు. ప్రింటర్‌ను బహుకరించిన శ్రీనివాసరెడ్డిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.హనుమంతరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-యడ్లపాడు: యడ్లపాడు మండలం కొత్త సొలస గ్రామ ఎస్టీ కాలనీ సమీపంలో ఓ బావిలో మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఆదివారం రాత్రి పోలీసులకు సమాచారం అందడంతో సోమ వారం ఉదయాన్నే శవాన్ని బయటికి తీయించి విచారణ చేపట్టారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన చలంచర్ల నాగమ్మ (55) గా గుర్తించారు. మృతురాలికి భర్త కోటేశ్వరరావు, ఇరువురు సంతానం వున్నట్లు పోలీసులు తెలిపారు. కొద్దికాలం నుండి నాగమ్మ ఒంటరిగా కొత్త సొలస గ్రామ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్నట్లు, ఆమెకు పలు అనారోగ్య సమస్యలు వున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం నాగమ్మ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి వుండవచ్చునన్న అనుమానం పలువురు వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. చిలకలూరిపేట సీఐ పి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో యడ్లపాడు ఎస్సై జె శామ్యూల్ రాజీవ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐస్ క్రీమ్ పార్లర్‌ను ప్రారంభించిన జీవి

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక స్టేట్ బ్యాంక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన హాలో ఐస్ క్రీమ్ పార్లర్‌ను ప్రారంభించిన పల్నాడు జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షులు, వినుకొండ మాజీ శాసన సభ్యులు జీ.వి ఆంజనేయులు. కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

డబ్బు రాజకీయాలకు ఎప్పుడు పాల్పడలేదు : మక్కెన

విశాలాంధ్ర-వినుకొండ : తాను ప్రజల సహకారంతో నీతివంతమైన రాజకీయాలు చేస్తున్నాను తప్ప. డబ్బు రాజకీయాలకు తాను ఎప్పుడు పాల్పడలేదని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. సోమ వారం రాత్రి విలేకరుల సమావేశంలోమాట్లాడారు. జీవీ ఆంజనేయులు. తాను తోడు దొంగలయ్యాము అని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లా డటం. సిగ్గుచేటు అన్నారు. లారీ క్లీనర్‌గా జీవితం ప్రారం భించిన బ్రహ్మనాయుడు గ్రామాలలో సినిమాలువేసుకుంటూ. చివరకు తిరుమల డైరీ ఏర్పాటు చేసి. ఆ డైరీ వల్ల రైతులకు పాల శాతం తక్కువ వేసి రైతు లను ముంచి నేడు కోట్లకు పడగలె త్తాడని మక్కెన బ్రహ్మ నాయుడు పై విరుచుకుపడ్డారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ తన తండ్రి చిన్న రామయ్యకు 30 ఎకరాల పొలం ఉందని. గ్రామ సర్పంచ్ నుండి తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి నియోజకవర్గాన్ని ఎంతోఅభివృద్ధిచేశానన్నారు. రానున్న ఎన్నికల్లో బొల్లా బ్రహ్మనాయుడుకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పి వినుకొండ నుండి సాగ నంపుతారని మక్కెన జోస్యం చెప్పారు.

అంబటికి వైశ్యుల వలన ఓటమి తప్పదు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అంబటి రాంబాబు అనుచరులు ఆర్యవైశ్యులు జోలికొస్తే సహించేది లేదని, మీ చర్యల వలన ఆర్యవైశ్యలు చేతుల్లోనే మీకు ఘోర ఓటమి తప్పదని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆది నుంచే అంబటి రాంబాబు ఆర్యవైశ్యుల మీద కక్ష సాధింపు చర్యలు మొదలు పెట్టారన్నారు. పదవి స్వీకరించిన అతి కొద్ది రోజుల్లోనే సత్తెనపల్లి పట్టణంలో నిజాయితీగా పనిచేసే ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నిర్ధాక్షణ్యంగా కరెంట్ బిల్ రీడింగ్ ఒప్పందం నుంచి తొలగించి ఆర్య వైశ్యులపై తొలి వేటు వేశారన్నారు. మీ పార్టీకే చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిపై తప్పుడు కేసులు నమోదు చేయించి మీ కక్ష సాధింపును కొన సాగించారన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)::గురజాల
ఐ.పి. నెం. 65 / 2023

బిట్వీన్ :
పంచాల మల్లేశ్వరి ....పిటీషనర్
మరియు
కాయకోకుల లింగమ్మ మరియు 20 మంది ...రెస్పాండెంట్లు

To,
1)కాయకోకుల లింగమ్మ, 2)కాయకోకుల శ్రీనివాసరావు, 3) నారికెళ్ల పద్మ, 4)ఓబూరి సైదమ్మ, 5) దుర్గి రమేష్‌బాబు, 6) సిరిసాల పెద్ద వెంకట శివ, 7) నెమలికంటి కృష్ణాచలం, 8) నెమలికంటి లక్ష్మణ, 9)నెమలికంటి రంగమ్మ, 10) ఓబూరి సుధారాణి, 11)బూక్యా కోటమ్మ, 12) జంపల యశోదమ్మ, 13) రమావత్ సామ్రాజ్యం, 14)కాయకోకుల మంగమ్మ, 15) కాయకోకుల లింగయ్య, 16) పేరుపోగు సత్తెమ్మ, 17) అడపాల నారాయనమ్మ, 18) బందారి అలేఖ, 19) ముక్కపాటి మహాలక్ష్మీ, 20)పోట్ల అపరమ్మ.

పై నెంబరు IP లోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చేయమని కోరుచు పిటీషన్ దాఖలుచేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం ది:27-02-2024కి వాయిదావేసి వారు. కావున ఆరోజున ఉ॥గం॥ 10:30ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించ బడును. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).
వాయిదా తేది: 27-02-2024.

చీతిరాల కోటేశ్వరరావు
పిటీషనర్ తరపు న్యాయవాది, గురజాల,
పల్నాడుజిల్లా. సెల్: 9912257456